# వార్షిక మహా సభ యు.కే. సందర్భమున
# జల్స సేవకులు, అతిథులను ఉద్దేశించి అమూల్యమైన ఉపదాశాలు

హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 24.07.2026 తేదీన – హదీఖతుల్ మహ్దీ, ఆల్టన్, (హాంపషైర్) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం

أَشْهَدُ أَنْ لَّآ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ. أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ. بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

అల్లాహ్ తఆలా కృపతో ఈ రోజు యుకే జల్సా సాలానా (వార్షిక మహా సభ) ప్రారంభమవుతోంది. దేశంలోని ప్రతీ మూల నుండి మరియు ప్రపంచంలోని వివిధ దేశాల నుండి అతిథులు దీనిలో పాల్గొనడానికి వస్తున్నారు లేదా ఇప్పటికే వచ్చారు. వీరందరూ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అతిథులు, వీరు ఒక ప్రత్యేకమైన ధార్మిక లక్ష్యం కోసం ఇక్కడికి వస్తున్నారు. కావున ఈ అతిథులకు ఆతిథ్యం ఇవ్వడం కూడా ఒక ప్రత్యేకమైన గౌరవంగా నిలుస్తుంది.

అల్లాహ్ తఆలా కృపతో ప్రపంచంలో జల్సా సాలానా జరిగే ప్రతీ దేశంలోనూ ఉన్న పిల్లలు, యువకులు, పురుషులు మరియు మహిళలు అందరూ కూడా మేము జల్సా అతిథులకు సేవ చేయాలి అనే విషయాన్ని స్పష్టంగా గ్రహిస్తారు. దీని కోసం ప్రతి ఒక్కరూ తమను తాము స్వచ్ఛంద సేవకులుగా సమర్పించుకుంటారు. నేడు ప్రాపంచిక ప్రజల ప్రాధాన్యతలు మారినప్పటికీ, జమాఅత్ వినమ్రులు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అతిథుల సేవ కోసం తమను తాము సమర్పించుకుంటున్నారు.

అతిథుల సేవ చేయడం, వారిని గౌరవించడం, వారికి మర్యాదలు చేయడం గురించిన ఆజ్ఞ అల్లాహ్ తఆలా ఇచ్చాడనే విషయాన్ని స్పష్టంగా గ్రహించిన వ్యక్తులు వీరు. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ ఆచరణ, ప్రవచనాల ద్వారా ఈ విషయాన్ని బోధించారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కూడా ఈ అంశం వైపు పదే పదే సూచించారు.

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు: అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించేవారు అతిథి సముచితమైన హక్కును నెరవేరుస్తారు లేదా నెరవేర్చాలి. దానికి సముచితమైన హక్కు ఏమిటి? అని ప్రశ్నించగా మహా ప్రవక్త (స) ఒక పగలు, ఒక రాత్రి ఆతిథ్యం ఇవ్వడం అని చెప్పారు. మరొక చోట మూడు రోజుల వరకు అతనికి ఆతిథ్యం ఇవ్వండి అనే కథనం కూడా లభిస్తుంది.

ఇది ప్రత్యేక అతిథుల కోసం. సాధారణంగా ప్రజల ఇళ్లకు కొద్ది రోజుల పాటు వచ్చేవారి కోసం. సాధారణంగా ఏ అతిథి వచ్చినా వారికి ఆతిథ్యం ఇవ్వవలెను, ముస్లింలకు ఉన్న ఆజ్ఞ ఇదే.

ఈ రోజుల్లో జల్సా సమయాల్లో వస్తున్న అతిథులు దూర ప్రాంతాల నుండి, ఇతర దేశాల నుండి ప్రయాణించి వస్తున్నారు. వీరు ఖచ్చితంగా మూడు రోజుల కంటే ఎక్కువ కాలమే ఉంటారు. జమాఅత్

నిర్వహణలో వీరు ఎన్ని రోజులు ఉన్నప్పటికీ మూడు నుండి నాలుగు వారాలు లేదా రెండు నుండి మూడు వారాలు అయినా జమాఅత్ వారికి ఆతిథ్యం ఇస్తుంది. ఇందుకోసం అల్లాహ్ తఆలా గొప్ప అనుగ్రహం ఏమిటంటే, వీరికి ఆతిథ్యం ఇవ్వడానికి జమాఅత్ వద్ద ఏ విధమైన వేతనం పొందని సేవకులు ఇంత పెద్ద సంఖ్యలో అందుబాటులో ఉన్నారు. మూడు నుండి నాలుగు వారాల పాటు స్వచ్ఛంద సేవకులు ఈ లక్ష్యం కోసం తమను తాము సమర్పించుకుంటారు. అంతేకాకుండా, ఇక్కడ యుకేలో ఆతిథ్య వ్యవస్థ ఎంత విస్తృతంగా మారిందంటే, ఏడాది పొడవునా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం లంగర్ నడుస్తూనే ఉంటుంది. ఎందుకంటే ఇక్కడ ఖిలాఫత్ ఉంది. వర్తమాన ఖలీఫా కారణంగా ప్రజల రాకపోకలు చాలా ఎక్కువగా ఉంటాయి. దీనివల్ల ఆతిథ్యం కూడా ఇవ్వాల్సి వస్తుంది. అల్లాహ్ తఆలా వీరందరికీ ఉత్తమమైన ప్రతిఫలాన్ని ప్రసాదించుగాక!

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా ప్రవచించారు: అతిథి భావోద్వేగాలు చాలా సున్నితంగా ఉంటాయి, కాబట్టి వారిని ఎల్లప్పుడూ జాగ్రత్తగా చూసుకోవలెను. కావున, మనం అతిథులకు అన్ని విధాలా సేవ చేయాలనే విషయాన్ని మనం మర్చిపోకూడదు. మనం సేవ కోసం ముందుకు వచ్చామంటే, అల్లాహ్ తఆలా ప్రసన్నతను పొందడం కోసం ఈ బాధ్యతను నెరవేర్చడానికి మన శక్తివంచన లేకుండా ప్రయత్నించవలెను. తద్వారా ఈ సేవకు ప్రతిఫలంగా అల్లాహ్ తఆలా కూడా మన పట్ల సంతోషిస్తాడు. వీలైనంత వరకు మనం మసీహే ముహమ్మదీ గారి అతిథుల సేవ చేసే హక్కును నెరవేర్చగలుగుతాము.

ఆతిథ్యం ఇచ్చే మన సేవకులు, మన జల్సా ఏర్పాట్లను చూసి బయట నుండి వచ్చిన అహ్మదీయేతర, ముస్లిమేతర అతిథులు కూడా ఎంతగానో ప్రభావితమవుతారు. ఇక్కడ నడుస్తున్న సేవకుల వ్యవస్థను చూసి వారు ఆశ్చర్యపోతారు. ఇందులో ట్రాఫిక్ వ్యవస్థ, భోజన వసతి వ్యవస్థ, పరిశుభ్రత వ్యవస్థ, వంటశాల వ్యవస్థ, మంచి నీటి సరఫరా వ్యవస్థ ఇలా అనేక విభాగాలు ఉన్నాయి. వీటిలో అల్లాహ్ తఆలా కృపతో జమాఅత్ స్వచ్ఛంద సేవకులు పనిచేస్తున్నారు. బయటి ప్రజలు దీనిని చూసి ఎంతో ప్రభావితమవుతారు. ఇది కూడా ధర్మ ప్రచారానికి ఒక సాధనమే.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అతిథులకు ఎంతగా సేవ చేసేవారో లేదా వారిని ఏ స్థాయిలో జాగ్రత్తగా చూసుకునేవారో ఈ కథనం తెలియజేస్తుంది. ఒక కథనంలో వారు అతిథుల పట్ల అత్యంత శ్రద్ధ వహించేవారని వస్తుంది. లంగర్ అతిథులను చూసుకోవడానికి హజ్రత్ హాఫిజ్ హామిద్ అలీ గారు (రజి) నియమించబడ్డారు. ఆ సమయంలో హుజూర్ (అ) వారికి ఈ అతిథుల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ వహించండి, సాధారణ రోజుల్లో కూడా అతిథుల స్థాయికి తగినట్లుగా వారికి సేవ చేయండి అని పదే పదే గుర్తుచేసేవారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆతిథ్యానికి సంబంధించిన అనేక సంఘటనలు లభిస్తాయి. ఇవి వారి వాత్సల్యాన్ని, బాధ్యతా రాహిత్యానికి చోటు ఇవ్వని అనుభూతిని, అతిథులతో వారు ప్రవర్తించే మంచి ప్రవర్తనకు అత్యుత్తమ మాదిరిని అందిస్తాయి. హజ్రత్ డాక్టర్ హష్మతుల్లా గారు (రజి) తెలిపిన వివరాల ప్రకారం. జల్సా సమయంలో జమాఅత్ సమావేశంలో పాల్గొనడం వల్ల ఆయన భోజనం చేయలేకపోయారు. సమావేశం ముగిసిన తర్వాత అర్ధరాత్రి ఆయన లంగర్ ఖానాకు చేరుకునేసరికి భోజనం అయిపోయింది. రొట్టె ముక్క మాత్రమే దొరకగా ఆయన దాన్ని తినడం ప్రారంభించారు. సరిగ్గా అదే సమయంలో తలుపు తట్టి ఎవరైనా అతిథి

ఆకలితో ఉండిపోతే లంగర్ ఖానాకు వచ్చి భోజనం చేయండి అని పిలుపు వచ్చింది. మరుసటి రోజు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా సెలవిచ్చారు: రాత్రి అల్లాహ్ తఆలా నుండి ఈ దివ్యవాణి వచ్చింది: يَا أَيُّهَا النَّبِيُّ أَطْعِمُوا الْجَائِعَ وَالْمُعْتَرَّ అనగా ఓ ప్రవక్తా! ఆకలితో ఉన్నవారికి, అవసరంలో ఉన్నవారికి భోజనం పెట్టు.

ఈ సంఘటన ద్వారా అల్లాహ్ తఆలా తన అతిథుల బాధను కూడా గ్రహిస్తాడని వ్యక్తమవుతోంది. అందువల్ల జల్సా నిర్వాహకులు ఎల్లప్పుడూ ఈ విషయాన్ని గుర్తుంచుకోవలెను. ప్రయాణం వల్ల ఆలస్యంగా వచ్చే అతిథులకు లేదా ఏదైనా అనివార్య కారణాల వల్ల సమయానికి భోజనం చేయలేకపోయిన వారికి కూడా సరిపడా, తాజా భోజనం లభించేలా ఏర్పాట్లు ఉండాలి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇంకా ఇలా ఉపదేశించారు: నా అనుచరులు పేదవారైనా, ధనికులైనా సరే నా దృష్టిలో అందరూ సమానులే. కాబట్టి మాంసము, పులావ్ వండితే అది అందరికీ వడ్డించవలెను, ఒకవేళ పప్పు మాత్రమే వండితే అది కూడా అందరికీ సమానంగానే పంచిపెట్టాలి. ఈ బోధన సమానత్వం, న్యాయం, సోదరభావాలకు అత్యున్నత ప్రమాణాన్ని నెలకొల్పుతుంది.

హుజూరే అన్వర్ ఇట్లన్నారు: ఇవి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పద్ధతులు. ఇది వారి శైలి, వారి బోధనల ధోరణి, వారి ఆతిథ్య విధానాలు. ఏది ఏమైనప్పటికీ, అతిథులు కూడా ఈ విషయాన్ని గుర్తుంచుకోవలెను. లంగర్ నిర్వహణలో వండిన భోజనంలో ఏది లభించినా, దానిని సహనం, కృతజ్ఞతలతో స్వీకరించవలెను. మీరు ఇక్కడికి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పిలుపు మేరకు వచ్చారు, మనం ఇక్కడ ఆధ్యాత్మిక విందును పొందవలెను అనే లక్ష్యంతో వచ్చారు. కాబట్టి మీ దృష్టి ఆధ్యాత్మిక విందుపైనే ఎక్కువగా ఉండవలెను. ఒకవేళ భోజనంలో ఏదైనా లోటుపాట్లు ఉన్నప్పటికీ, సహనంతో భరించాలి తప్ప పట్టుబట్టి అడగకూడదు. అందువల్ల అతిథులు కూడా ఈ మూడు రోజుల్లో ఏది లభించినా, దానిని సంతోషంగా స్వీకరించాలని, ఈ పదార్థం మాకు నచ్చలేదు, మేము తినమని ఏ విధమైన అసంతృప్తిని వ్యక్తం చేయకూడదని గుర్తుంచుకోవలెను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అతిథులకు వడ్డించే భోజన నాణ్యతకు సంబంధించిన జాగ్రత్తల గురించిన ఒక కథనాన్ని ప్రస్తావించిన తర్వాత హుజూరే అన్వర్ ఇలా హితవు పలికారు: వంట వండే విధిలో ఉన్న సేవకులు కూడా చాలా జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా ఇప్పుడు వేసవి కాలమైనందున, ఆహారం మంచిగా ఉండేలా, ఎక్కువ సమయం నిల్వ ఉండకుండా ఏర్పాట్లు చేయ వలెను. ముఖ్యంగా పప్పు మొదలైనవి త్వరగా పాడైపోతాయి కాబట్టి, వాటిని ఎక్కువ జమయం ఉంచి అతిథులకు వడ్డించకూడదు. దీనిని ప్రత్యేకంగా దృష్టిలో ఉంచుకోవలెను. వడ్డించే ముందు భోజనాన్ని బాగా పరీక్షించి చూసుకోవాలి.

మీరు ఏ సదుద్దేశంతో ఇక్కడికి వచ్చారో దానినే నెరవేర్చుకోవాలని ఎల్లప్పుడూ గుర్తుంచుకోండి. అలా కానట్లయితే ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. ఇక్కడ నమాజుల కోసం క్రమబద్ధమైన ఏర్పాట్లు ఉన్నప్పటికీ, ఇక్కడ సుదీర్ఘ కాలం బస చేస్తున్నవారు, జమాఅత్ వసతి గృహాల్లో ఉంటున్నవారు జల్సా ముగిసిన తర్వాత కూడా నమాజులపై క్రమం తప్పకుండా దృష్టి సారించాలి మరియు సమూహంగా (బాజమాఅత్) నమాజ్ చదవడానికి ప్రయత్నించవలెను. ఈ మూడు రోజులలో ఇక్కడ తహజ్జుద్ కూడా జరుగుతుంది. కావున ఇక్కడ గుడారాలలో లేదా మార్కీలలో బస చేస్తున్నవారందరూ తహజ్జుద్ సమయంలో

లేపినప్పుడు తప్పక మేల్కొనాలి. దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. సాధారణ సమాజులలో క్రమశిక్షణ ఎలాగూ ఉంటుంది, కానీ తహజ్జుద్‌ను కూడా క్రమం తప్పకుండా ఆచరించడానికి ప్రత్యేకంగా ప్రయత్నించ వలెను.

వాతావరణంలో ఉన్న పొడిబారిన తనాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యక్తిగత లేదా ఉమ్మడి వసతి ప్రాంతాలలో ఎలాంటి నిప్పు వెలిగించకూడదని హుజూరే అన్వర్ హెచ్చరిస్తూ, ఏ ప్రదేశంలో కూర్చున్నా ఎలాంటి చిన్న నిప్పురవ్వనైనా రాకుండా జాగ్రత్త పడాలి. అజాగ్రత్త వల్ల ఏదైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది కాబట్టి అత్యంత జాగ్రత్తగా ఉండాలని నొక్కి చెప్పారు.

పరిశుభ్రత ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ హుజూరే అన్వర్ ఇట్లన్నారు. నిర్వాహక విభాగం స్నాన గదులు, శౌచాలయాలు, ఇతర ప్రాంతాల పరిశుభ్రతకు ఏర్పాట్లు చేసినప్పటికీ, ప్రతీ అతిథి, ప్రతీ సభ్యుడు ఉపయోగించిన తర్వాత పరిశుభ్రతను పాటించడం వారి బాధ్యత. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం హదీసు ప్రకారం ‘పరిశుభ్రత అనేది విశ్వాసంలో భాగం’. కాబట్టి విశ్వాసాన్ని పెంపొందించుకోవడానికి జల్సాకు వచ్చినప్పుడు, పరిశుభ్రతను కూడా ఒక ఆరాధనగా భావిస్తూ ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఈ రోజుల్లో ప్రతీ ఒక్కరూ తమను తాము ఒక సేవకునిలగా భావించి, ఎక్కడ అవసరం అనిపిస్తే అక్కడ సహకరించవలెను.

హుజూరే అన్వర్ విశ్వాస ప్రమాణాలను పెంచుకోవాలని ప్రత్యేకంగా సూచించారు. ఖాళీ సమయాల్లో దైవ స్మరణ, దురూద్ షరీఫ్, ఇస్తగ్‌ఫార్ మరియు దుఆలలో నిమగ్నమై ఉండవలెను. అనవసరమైన సంభాషణలు, వ్యర్థమైన వ్యాపకాలు, నిష్ప్రయోజనకర మాటలకు దూరంగా ఉండి, ధార్మిక విషయాలు, దైవస్మరణను మీ మాటల్లో భాగం చేసుకోవాలి. అదేవిధంగా, జల్సాలో ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శనలను (ఎగ్జిబిషన్లను) తప్పక సందర్శించి ప్రయోజనం పొందాలి. వాటిని కేవలం చూడటానికి ఉన్న వస్తువులుగా భావించకుండా, ఆసక్తితో, శ్రద్ధతో చూడాలి. ఎందుకంటే వాటి నుండి జ్ఞానపరమైన, చారిత్రక, ధార్మిక సమాచారం లభిస్తుంది, ఇది మనిషి విశ్వాసాన్ని, జ్ఞానాన్ని పెంచుతుంది.

ముగింపులో హుజూరే అన్వర్ ఇలా ప్రార్థించారు. అల్లాహ్ తఆలా పాల్గొనే ప్రతీ ఒక్కరికీ జల్సా సాలానా ధార్మిక, ఆధ్యాత్మిక, జ్ఞానపర శుభాలలో సమృద్ధిగా భాగాన్ని ప్రసాదించుగాక! ఈ శుభాలు వారి జీవితాల్లో ఎల్లప్పుడూ నిలిచి ఉండి, వారి భావి తరాలకు కూడా విస్తరించుగాక! హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అవతరణ లక్ష్యాన్ని నెరవేర్చేవారిగా అల్లాహ్ తఆలా వారిని చేయుగాక!

జల్సా ప్రారంభ ప్రసంగాన్ని, ఇతర అన్ని ప్రసంగాలను పూర్తి శ్రద్ధతో, ఆలోచనాత్మకంగా, నిష్ఠతో వినాలని, వాటిలో పేర్కొన్న హితవులను ఆచరించడానికి ప్రయత్నించాలని కూడా హితవు పలికారు. అల్లాహ్ తఆలా అందరిని ఇందుకు అనుగ్రహించుగాక! (ఆమీన్.)

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ ـ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ
اَعْمَالِنَا ـ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ ـ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ
وَرَسُوْلُهٗ ـ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَأْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ
وَالْبَغْيِ ـ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ ـ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ ـ